క్లుప్తంగా

మొక్కుబడిగా ప్రజావేదిక


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

చిప్పగిరి: ఉపాధి హామీ పథకం పనులు 2023-2024కు సంబంధించి సోమవారం నిర్వహించిన సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక మొక్కుబడిగా నిర్వహించి అధికారులు చేతులు దులుపుకున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో ఉపాధి పథకం కింద నిర్వహించిన పనుల వివరాలు సభలో చదివి వినిపించారు. మండలం మొత్తం రూ.6,89,90, 911 జరిగిన పనుల్లో రికవరీ మొత్తం రూ.1,13,104 కాగా,పెనాల్టీ కేవలం రూ.15,000గా తేల్చారు. అత్యధికంగా రామదుర్గం రూ.83,747 ఉండగా, కాజీపురం రూ.647 ఉన్నట్లు ఏపీఓ జుబేర్ అహమ్మద్ తెలిపారు. కార్యక్రమంలో పీడీ వెంకట రమణయ్య,డీవీఓ లోకేష్, ఏపీడీ పద్మావతి, ఎంపీడీఓ అల్లాబకాష్, ఏపీఓ మాధవ శంకర్, టీఏ మారుతి పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

పత్తికొండ(తుగ్గలి) : జనవరి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను మంగళవారం పంపిణీ చేయనున్నారు. నియోజకవర్గంలోని పత్తికొండ మండలంలో 8,494 మంది పింఛన్ దారులకు రూ.3,51,6500, మద్దికెరలో 4,710 మందికి రూ.1,99,64,000, తుగ్గలిలో 7,568 మందికి రూ.3,23,31,000, వెల్దుర్తిలో 7,835 మందికి రూ.3,32,86,500, కృష్ణగిరిలో 4,752 మందికి రూ.205,90,500 మంజూరైంది. ఒక్క రోజులోనే వందశాతం ప ంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. 31న ఉదయం నుంచే సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేయాలని అధికారులు స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఇళ్ల వద్దే ఉండాలని కోరారు.

బీమా వివరాలు అందజేయండి

మద్దికెర : మండలంలోని రైతులు 2024 రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ రకాల పంటలకు సంబంధించిన వివరాలు, పీఎం కిసాన్ ఫసల్ బీమా కింద ప్రీమియం చెల్లించిన వివరాలను సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులకు అందజేయాలని ఏఓ రవి సోమవారం తెలిపారు. పంటలు నమోదు చేయించుకున్న అన్నదాతలు తప్పనిసరిగా ఈ-కైవేసీ చేయించుకోవాలని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత శాస్త్ర సబ్జెక్టును బోధించేందుకు అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగభూషణరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు గణితశాస్త్రంలో పీజీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 2న కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

నేడు శిక్షణ తరగతులు

చిప్పగిరి: స్థానిక ఎంఆర్‌సీ భవనంలో మండలంలోని ఎస్‌ఎంసీ చైర్మన్‌లకు మంగళవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాస రెడ్డి- 2 సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 26 పాఠశాలలకు చెందిన చైర్మన్‌లు తప్పక హాజరు కావాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వివరిస్తామని చెప్పారు. శిక్షణ పొందిన చైర్మన్‌లు జనవరి 2న ఆయా పాఠశాలలో కమిటీ మెంబర్‌లకు శిక్షణ ఇస్తారని తెలిపారు.

పైప్‌లైన్ పనుల అడ్డగింత

తుగ్గలి : చెరువుకు హంద్రీనీవా కాలువ నీటిని మళ్లించిన తర్వాతే పైప్‌లైన్ పనులు కొనసాగించాలని సీపీఎం నాయకుడు కొండారెడ్డి డిమాండ్ చేశారు. మద్దికెర మండలం యడవలి హంద్రీనీవా కాలవ నుంచి జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ కంపెనీకి నీటిని తీసుకెళ్లేందుకు పైప్‌లైన్ పనులు చేపట్టారు. దీంతో సోమవారం పైప్‌లైన్ పనులను జొన్నగిరిలో అడ్డుకుని గ్రామస్తులతో కలిసి రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఏటా వేసవిలో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పైపులైన్ కనెక్షన్ చెరువుకు ఇచ్చిన తర్వాతే జియో మైసూర్ కంపెనీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

పత్తికొండ(తుగ్గలి) : ఆర్టీసీ పత్తికొండ డిపో పరిధిలోని ప్రయాణికులతో మంగళవారం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిపో మేనేజర్ సెల్ 9959225797 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు తెలియజేయాలన్నారు.

50శాతం ఈ- క్రాప్ బుకింగ్ పూర్తి

కృష్ణగిరి: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ ఇప్పటి వరకు 50శాతం నమోదు చేసినట్లు ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని తొగర్చేడు, కృష్ణగిరి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదును సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 9 వేల ఎకరాలకు గాను ఇప్పటివరకు 4వేలకుపైగా ఎకరాల్లో నమోదు పూర్తి చేశామన్నారు.

ఎస్సీలకే కేటాయించండి

ఆలూరు రూరల్: మండలంలోని ఎం.కొట్టాల గ్రామ రేషన్ షాపు రోస్టర్ పద్ధతిన ఎస్సీలకే కేటాయించాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు రామాంజనేయులు, రాజు, చిట్టెన్న పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలోని రేషన్ షాపు నంబర్ 25 పరిధిలో ఎస్సీ, బీసీ కులానికి చెందిన వారే నివాసం ఉన్నారు. ఇటీవల ఉన్నతాధికారులు ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించారన్నారు .రేషన్ షాపు కేటాయింపు రోస్టర్ పద్ధతిన ఎస్సీలకు కేటాయించాలని చెప్పారు.

మురుగు పారదు.. సమస్య తీరదు!


ఆలూరులోని పాత ఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం ఆవరణలో నిలిచిన మురుగునీరు

ఆలూరు రూరల్: ఇదేదో చెరువు అనుకుంటే పొరబాటే. ఆలూరు పట్టణంలోని పాత ఎస్‌డబ్ల్యూఓ కార్యాలయ ఆవరణను ముంచేసిన మురుగు. పట్టణంలోని కోయనగర్ కాలనీ నుంచి మురుగు, వృథా నీరంతా ఇక్కడికి వచ్చి నిల్వ ఉండిపోవడంతో చెరువులా మారిపోయింది. గత నాలుగేళ్లుగా ఇక్కడ మురుగు నీరు నిచిపోయింది. దీంతో ఈ కుంట దోమలు, పందులకు ఆవాసంగా మారిపోయంది. గ్రామ పంచాయతీ అధికారులకు స్థానికులు విన్నవించినా కనీస చర్యలు తీసుకోకపోవడంతో సమస్య తీవ్రంగా మారింది. మురుగునీటి కుంటకు పది అడుగుల దూరంలో సమీకృత బాలుర వసతి గృహం ఉంది. 200 మందికి పైగా హాస్టల్ విద్యార్థులు ఇందులోనే వసతి పొందుతున్నారు. ఏళ్లుగా నీరు నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పందులు సంచారం తీవ్రవమువడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం పత్తికొండకు తరలించారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టి కార్యాలయాన్ని మరో విభాగానికి కేటాయించాలని కోరుతున్నారు.


రెండు ట్యాంకుల వద్ద రోడ్డుపై అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్


సచివాలయం-3 వద్ద మురుగు కాల్వ నిర్మాణానికి అడ్డుగానున్న ట్రాన్స్‌ఫార్మర్

అభివృద్ధికి అడ్డంగా!


కెనరా బ్యాంకు వద్ద..

మద్దికెర : మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు ట్రాన్స్‌ఫార్మర్లు అడ్డంకిగా మారాయి. ప్రధాన బస్టాండు వద్ద నుంచి కెనరాబ్యాంకు వరకు ఇప్పటికే డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. అలాగే బస్టాండు వద్ద నుంచి కెనరాబ్యాంకు మలుపు వరకు సీసీ రోడ్లు వేయడానికి జెడ్పీ నిధులు రూ.10 లక్షలు, ఉపాధి నిధులు రూ.10 లక్షలు మంజూరు చేయడంతో సంబంధిత అధికారులు పనులు మొదలుపెట్టారు. అయితే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో సర్పంచ్, అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ మర్చాలని గత నెలలో విద్యుత్ అధికారుల దృష్టికెళ్లారు. అయితే ఇంతవరకు వాటిని మరో చోటుకు మార్చక పోవడంతో పనులు చేపట్టడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈవిషయాన్ని విద్యుత్ ఏఈ రఫీక్ దృష్టికి తీసుకెళ్లగా నిబంధనల ప్రకారం రుసుం చెల్లిస్తే మార్చేందుకు వీలవుతుందని చెప్పారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు


పశువైద్యాధికారికి స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న నిర్వాహకులు


దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

మద్దికెర : స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా స్వామి వారికి విశేష, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంరించి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహామంగళహారతి తదితర పూజలు చేపట్టారు. పూజలకు విచ్చేసిన పశువైద్యాధికారి కృష్ణా నాయక్‌కు స్వామి వారి జ్ఞాపికను ఆలయ నిర్వాహకులు విజయ్ అందజేశారు.

హొళగుంద: మండలంలో సోమవారం అమావాస్య సందర్భంగా ఆలయాలు, దర్గాల్లో విశేష పూజలు, ప్రత్యేక ఫాతెహాలు జరిగాయి. దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు మూలవిరాట్‌లకు జలాభిషేక, సుప్రభాత సేవ, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, నైవేద్య సంతర్పణ చేశారు.అలాగే హొళగుంద సిద్దేశ్వర స్వామి, సాయిబాబా మందిరం, ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలు, హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేశారు.

అమావాస్య పూజలు

ఆస్పరి: స్థానిక జనార్ధన స్వామి, మారెమ్మ, కన్యకా పరమేశ్వరీ, రామతీర్థంలో రామలింగేశ్వర స్వామి, గాయత్రీ మాత, జొహరాపురం గ్రామంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో సోమవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు గంగ,ఆకు పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, గాయత్రీ హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పోటీ పరీక్షల్లో రాణిస్తే ఉత్తమ భవిష్యత్

మద్దికెర : పోటీ పరీక్షల్లో రాణిస్తేనే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ గోపాల్ అన్నారు. సోమవారం స్థానిక వశిష్ఠ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి ఈనెల 29న ఆదోనిలో జరిగిన అబాకాస్ సీనియర్ లెవెల్‌లో విభాగం పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి వడ్ల ధనుంజయను అభినందించి బహుమతులు, ధ్రువపత్రం అందజేశారు. కరస్పాండెంట్ పక్కీరప్ప, ఉపాధ్యాయులు గోవిందు, రామాంజనేయులు, మురళీ పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓ గోపాల్

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

దేవనకొండ: రాష్ట్రస్థాయి పోటీలకు స్థానిక ఎఫ్ఆర్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ఉచ్చీరప్ప, కరస్పాండెంట్ రఘునాథ్ తెలిపారు. సోమవారం ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. వారు మాట్లాడుతూ ఆదోని పట్టణంలో ఆదివారం జరిగిన అబాకస్ జిల్లా స్థాయి పోటీల్లో ఎఫ్ఆర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. గెలుపొందిన వారిలో సీనియర్ విద్యార్థులు రూప (8వ తరగతి), జూనియర్ స్థాయిలో ప్రశాంత్ (5వ తరగతి) మొదటిస్థానాల్లో నిలిచారన్నారు. వీరు జనవరి 9న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి

కృష్ణగిరి: వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐలు జి. అశోక్, మల్లికార్జున సూచించారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. న్యూ ఇయర్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. యువకులు ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీసి పెద్ద శబ్దంతో ట్రిపుల్ రైడ్ చేస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 31వ తేదీ సాయంత్రం నుంచే వీధుల్లో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు పాలవుతారన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. తాగిన మైకంలో ఆకతాయిలు మహిళలను వేధిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వేడుకల్లో డీజే, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : నూతన సంవత్సర వేడుకలపై విధించిన ఆంక్షలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ జయన్న సోమవారం టో ప్రకటనలో హెచ్చరించారు. డిసెంబర్ 31 సందర్భంగా రోడ్లపై అతివేగం, ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీసివేసి నడపడం, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వేడుకల పేరుతో ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించొద్దని సూచించారు. రోడ్లపై కేక్‌లు కట్‌చేయవద్దని, ట్రాఫిక్ జామ్ చేసేలా వ్యహరిస్తే చర్యలు తప్పవన్నారు.

హాలహర్వి: నూతన సంవత్సర వేడుకలను అన్నివర్గాల ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ చంద్ర సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 31వ తేదీన రాత్రి టపాసులు పేల్చడం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేయడం, అల్లర్లు, గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

తుగ్గలి : ఎస్సీ కుల గణన జాబితాలో బీసీలను చేర్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, రమేష్, పులికొండ, రోళ్లపాడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..చెన్నంపల్లి గ్రామ సచివాలయంలో ఎస్సీ కుల గణన ఆడిట్‌కు సంబంధించి ప్రచురించిన జాబితాలో రామలింగాయపల్లికి చెందిన 52మందిని బీసీలు మాదాసి కురువ పేరుతో జాబితాలో నమోదు చేశారన్నారు. ఈ ప్రాంతంలో అసలు మాదాసి కురువలు లేరని అలాంటిది ఆ పేరుతో ఎస్సీ జాబితాలో ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు.

ఆస్పరి: కురువ కులస్తులను ఎస్సీలుగా గుర్తించరాదని దళిత సంఘాలు, ఎంఆర్‌పీఎస్, మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధార్నా చేపట్టి అనంతరం తహసీల్దార్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా మాజీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది, ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పెద్ద సంజప్ప, దళిత సంఘాల నాయకులు జోజి, వీరభద్రి మాట్లాడారు.

పనులు సకాలంలో పూర్తి చేయండి

మద్దికెర : ఉపాధి నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు సకాలంలో పూర్తి చేయాలని పీఆర్ డీఈ శేషయ్య అన్నారు. సోమవారం స్థానిక మహాత్మా గాంధీ సర్కిల్ నుంచి కెనరాబ్యాంకు మలుపు వరకు జరుగుతున్న సీసీ రోడ్డు పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయన్నారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి శివకుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విష్ణు, చంద్రశేఖర్ ఉన్నారు.

ఆసుపత్రి స్థాయి పెంచాలి

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిని 500 పడకల ఆస్పత్రిగా మార్చాలని సీపీఎం మండల కార్యదర్శి చక్రాల్ల వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఏడాదిన్నర క్రితం డివిజన్ కేంద్రంగా చేశారని, అలాగే.. ఆస్పత్రి స్థాయి కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు ఎమ్మిగనూరులో నిర్వహిస్తున్న పార్టీ జిల్లా మహా సభల్లో తీర్మానాన్ని ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. అత్యంత వెనుకబడిన పత్తికొండ ప్రాంతానికి సాగు, తాగు నీరు ఇవ్వాలని, టమాట జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు, పట్టణంలో రోడ్డు వెడల్పు, వలసల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఆస్పత్రిలో కాన్పులు జరగకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు హొళగుందకు ఎమ్మెల్యే రాక

హొళగుంద: ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి మంగళవారం హొన్నూరు కొట్టాల, సమ్మతగేరి గ్రామాల్లో పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా సోమవారం తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్, వైస్ ఎంపీపీలు, ఎంటీపీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొపాలని కోరారు.

ఎంపీడీఓపై దాడి దారుణం

ఆలూరు: అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం ఎంపీడీఓ జవహర్‌బాబుపై దాడికి పాల్పడం దారుణమని ఏపీ పీఆర్ ఆలూరు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఖండించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం నియోజకవర్గ ఏపీజీఈఏ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజన్న ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షురాలు కె.శశికళ, నాయకులు దేవేంద్రనాయక్ మాట్లాడుతూ దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా రమణ మహర్షి జయంతి


పత్తికొండలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు

పత్తికొండ(తుగ్గలి) : సద్గురు రమణ మహర్షి 145వ జయంతి వేడుకలను సోమవారం పత్తికొండలో ఘనంగా నిర్వహించారు. బైపాస్ రోడ్డులో రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆయన చిత్రపటానికి పూజలు చేశారు. రమణ తత్వంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు అన్నారు. ఆయన బోధనల్లో మౌనం, మౌనముద్ర ద్వారా ఎలాంటి సమస్యనైనా శాంతియుత మార్గంలో పరిష్కరించుకోవచ్చని తాము విశ్వసించినట్లు తెలిపారు.

హాలహర్వి: గూళ్యం గాదిలింగేశ్వర, అమృతాపురం టోపీ మారెమ్మవ్వ, క్షేత్రగుడి ఆంజనేయ స్వామి ఆలయాల్లో సోమవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

న్యాయవాదుల ఆందోళన


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి


ఆలూరులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పత్తికొండ(తుగ్గలి) : రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో న్యాయవాదుల పట్ల పోలీసుల అప్రజాస్వామ్య చర్యలను నిరసిస్తూ జిల్లా బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పత్తికొండ నాలుగు స్తంభాల కూడలిలో న్యాయవాదులు ధర్నా చేశారు. దీంతో గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించి రాకపోకలు నిలిచిపోయాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, సీనియర్ న్యాయవాదులు కారప్ప, మైరాముడు, వెంకటరాముడు, సత్యనారాయణ, కృష్ణయ్య, మల్లి, రమేష్, నరసింహయ్య, దామోదరాచారి, బాలబాషా, కృష్ణయ్య మాట్లాడారు..అనంతపురం త్రీ టౌన్ పోలీసు అధికారులు సివిల్ వ్యవహారంలో కలుగజేసుకుని సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి పట్ల అనుచితంగా ప్రవర్తించి బెదిరించారన్నారు. దీంతో ఆందోళనకు గురైన శేషాద్రి గుండెపోటుతో పోలీస్ స్టేషన్‌లోనే ప్రాణాలు కోల్పోయారన్నారు. ఘటన తర్వాత కూడా పోలీసు అధికారులు అమానవీయంగా ప్రవర్తించారని ఆరోపించారు. న్యాయవాది మృతికి కారణకులైన వారిని సస్పెండ్ చేసి వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన న్యాయవాదికి కుటుంబానికి పరిహారం అందించాలని, న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకొచ్చి అమలయ్యేలా చూడాలని కోరారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి

ఆలూరు రూరల్: సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతికి కారణమైన అనంతపురం త్రీటౌన్ సీఐపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆలూరు బార్ అండ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వాయుజీవోత్తమ రావు, షేక్షావలి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఓ సివిల్ పంచాయతీలో సీనియర్ న్యాయవాది శేషాద్రిని శనివారం పోలీసులు స్టేషన్‌కు పిలించి మందలించడంతోనే గుండెపోటుతో మృతి చెందాడని ఆరోపించారు. న్యాయవాది మృతికి కారణమైన సీఐను సస్పెండ్ చేయాలని కోరారు. న్యాయవాదులు రవి, ప్రవీణ్, విజయ్ రాజ్,హెచ్.కే రవి, విజయ్ భాస్కర్,రాజ్‌గోపాల్ నాయుడు, తిమ్మయ్య,సురేంద్ర, ఈరన్న, చాంద్ బాషా ఉన్నారు.

కూటమిలో 'మార్కెట్' మంట

- ఆలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ అభ్యర్థి ఎంపికలో పోటాపోటీ
- అభ్యర్థుల ఎంపికలో నాయకుల మధ్య పోటాపోటీ
- అధినాయకుల చుట్టూ ప్రదక్షిణలు
- పోటీలో ఉన్నామంటున్న జనసేన,బీజేపీ నేతలు



ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టు కూటమి నాయకుల మధ్య అగ్గి రాజేస్తోంది. తమకే కావాలంటూ పలువురు నేతలు పోటీపడుతున్నారు. కొందరు ఇప్పటికే జిల్లా, రాష్ట్ర నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. ఎలాగైనా తమ పేరునే ప్రతిపాదించేలా చూడాలంటూ అభ్యర్థిస్తున్నారు. ఇక నియోజకవర్గంలోనున్న నాయకులు కూడా తమ వర్గానికి చెందిన వారికే పదవి అప్పగించేలా పావులు కదుపుతున్నారు. ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం గడువు ఏడాది క్రితం ముగిసింది. ఇప్పటి వరకు వివిధ వర్గాలకు చెందిన వారు చైర్మన్‌గా వ్యవహరించారు. అయితే ఈసారి ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. దీంతో ఆలూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు నరసప్ప, త్యాగయ్య,చిన్నహ్యోట గ్రామానికి చెందిన శేషగిరి,ఆస్పరి మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మొలగవెల్లి గ్రామానికి చెందిన న్యాయవాది జనార్ధన్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకప్ప, బీజేపీలో కొనసాగుతున్న చిదానంద ఇలా పలువురి పేర్లు తెరపైకి వస్తున్నాయి. అభ్యర్థి ఎంపికలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున చౌదరి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. తమ అభ్యర్థులకు చైర్మన్ పీఠం దక్కేలా మంతనాలు సాగిస్తున్నారు.

నాయకుల ప్రదక్షిణలు..

ఆలూరు వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టు కోసం..గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బి.వీరభద్రగౌడు, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాదు, రాష్ట్ర మహిళా నాయకురాలు వైకుంఠం శివజ్యోతి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి (దేవనకొండ మండలం కావడంతో..)చుట్టూ స్థానిక నాయకులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎలాగైనా తమ వర్గానికి చెందిన వారికి కేటాయించాలని అధినాయకత్వంతో నియోజకవర్గ నాయకులు చర్చలు సాగిస్తున్నారు. ఈసారి తమకు కేటాయించాలని జనసేన, బీజేపీ నాయకులు తమ అధినాయకత్వానికి విన్నవించుకుంటున్నారు. తాము కూడా పోటీలో ఉన్నామని ఉనికి చాటుతుండటంతో చైర్మన్ అభ్యర్థి నిర్ణయం ఆసక్తికరంగా మారింది. అయితే పీఠం దక్కించుకునేందుకు స్థానిక నాయకత్వం బలప్రదర్శనకు దిగుతుండటం , పార్టీ వర్గాలుగా విడిపోయి ఎవరి దారిలో వారు పయనిస్తుండటంతో కేడర్‌కు దిక్కుతోచడం లేదు.

విద్యార్థి బస్సు సమయానికి నడపాలి

పత్తికొండ(తుగ్గలి) : విద్యార్థి బస్సు సమయానికి నడపాలని కోరుతూ ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవుల పవన్ కళ్యాణ్ సోమవారం ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ మాదన్నకు వినతి పత్రం అందజేశారు. ముక్కెళ్ల, మారెళ్ల, నునుసరాల్ల గ్రామాలకు సరైన సమయంలో బస్సు రావడం లేదని చెప్పారు.

వేడుకల కోసం..


బేకరీలో సిద్ధంగా ఉన్న కేకలు

పత్తికొండ(తుగ్గలి) : న్యూ ఇయర్ వేడుకల కోసం వెరైటీ కేక్‌లను మార్కెట్లో సిద్ధంగా ఉంచారు. రూ.200 నుంచి రూ.500 వరకు కేకులు అందుబాటులో ఉన్నాయి. కొందరు ఆర్డర్ ఇచ్చి ప్రత్యేకంగా తయారు చేయించుకుంటున్నారు.